ఇంటి వద్దకే వైద్యసేవలు

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ఇంటింటికి వైద్యసేవలు అందించే జగనన్న సురక్ష కార్యక్రమం చేస్తున్నారని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యం బాగోలేకపోతే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి రూ.వేలకు రూ.వేలు వెచ్చించాల్సి వచ్చేదని, పేదలకు ఆర్థిక భారం పడకూడదన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాస రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ముడిమేల పుల్లా రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ పార్వతమ్మ, గొర్రెల పెంపకందారుల సంఘం డైరెక్టర్ కాకనూరు సుబ్బయ్యయాదవ్, సొసైటీ చైర్మన్ శివలింగం, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ విక్రమసింహనాయక్, నాయకులు గోపాల్‌రెడ్డి, పెద్ద రామసుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

సున్నిపెంటలో..

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామసచివాలయం-3లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డాక్టర్లు 670 మందికి వైద్య సేవలు అందజేశారు. పలువురికి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేంద్రసింగ్, పంచాయతీ కార్యదర్శి బాలూనాయక్, డాక్టర్లు సోమశేఖర్, జాన్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ రజాక్, మండల అధ్యక్షులు జింకా గుండయ్య యాదవ్, మండల నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్‌దివ్యతేజ, గౌస్‌మోహిద్దీన్, కృష్ణవేణి, మత్స్యకార సహకార సంఘం నాయకులు కొండబాబు, మల్లికార్జున పాల్గొన్నారు.

లక్ష్మాపురంలో..

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీడీఓ వెంకటరమణ, గ్రామ సర్పంచ్ సుజాత పరిశీలించారు. 704 మంది రోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి 24 మందిని మెరుగైన వైద్య సేవలకు రెఫర్ చేశారు. రక్తపరీక్షలు 154, కంటి పరీక్షలు 104 మందికి చేసినట్లు వైద్యాధికారి మోహన్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఎంఈఓ సుభాన్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, డాక్టర్‌లు ప్రవీణ్‌కుమార్, కృష్ణమూర్తి, మోహన్, శ్వేత, పూర్ణచంద్రరావు, ఏపీఓ మద్దిలేటి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, పంచాయతీ కార్యదర్శి సమతయశోదర, ఉపేంద్రారెడ్డి, కోట్ల వెంకటేష్, ఇషాం బాషా, సచివాలయ కన్వీనర్ రమేస్‌నాయుడు, వైఎసాసర్‌సీపీ నాయకులు కొమారి వెంకటేష్, మహబూబ్‌బాషా, తిరుపతయ్య పాల్గొన్నారు.

పారుమంచాలలో..

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని పారుమంచాల గ్రామ జెడ్పీ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు యశ్విని, మౌనిక, సభా 950 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 20 మందికి మెరుగైన వైద్యపరీక్షల నిమిత్తం కర్నూలుకు రెఫర్‌చేశారు. మరో 20 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచ్ మాధవరం ప్రకాశం, ఎంపీటీసీ మిద్దెనీలమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటరమణ, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ మంగవల్లి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవసహాయం, నాగరత్నం, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన పాల్గొన్నారు.



వృద్ధురాలికి కంటి అద్దాలు సరిచేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



కేస్‌షీట్‌లు, మందులు అందిస్తున్న అధికారులు, నాయకులు



మహిళకు వైద్యం చేస్తున్న సిబ్బంది



పారుమంచాలలో ఓపీ కోసం బారులు తీరిన గ్రామస్తులు



వృద్ధులకు కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు చూపాలి

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వారు లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో లబ్ధిదారులకు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి రెండేళ్లవుతున్నా అధికారులు ఇళ్ల స్థలాలు చూపలేదన్నారు. అనంతరం ఎంపీపీ మురళీ కృష్ణారెడ్డి, డీటీ సోమేశ్వరీలకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిర్చి పంటను దున్నేసిన రైతు



రోటావేటర్‌తో మిరప పంటను దున్నేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని తంగడంచ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు శుక్రవారం రోటావేటర్‌తో తన మిర్చి పంటను దున్నేశాడు. ఐదుమాసాల క్రితం 1.50 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. పైరుకు బింగి తెగులుతో పాటు చీడపీడలు అధికం కావటంతో రూ.70 వేలు ఖర్చు చేసి రసాయన మందులు పిచికారీ చేశాడు. అయినా కాపు అంతంత మాత్రమే వచ్చింది. అందులోనూ 12కిలోల గంప రూ.200ల నుంచి రూ.250 లోపే ధర పలుకుతుండటంతో పెట్టుబడి కూడా చేతికందకపోవటంతో రోటావేటర్‌తో దున్నేస్తున్నట్లు రైతు తెలిపారు.

సర్పంచ్‌గా పేరెడ్డి వెంకటరామిరెడ్డి



సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకుంటున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామ సర్పంచ్‌గా పేరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ నాగస్వామిరెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి పేరెడ్డి వెంకటరామిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆనంద్‌కుమార్

నందికొట్కూరు: పాములపాడు మండలం వానాల గ్రామ పీర్ల చావిటి నిర్మాణానికి కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్‌కుమార్ రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎల్లాగౌడు, సంజీవరాయుడు, అంకన్న, శంకర్, వినోద్, నరేంద్ర, మహానందిరెడ్డి, నరసింహా, చంద్ర, మాజీ సర్పంచ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ హోమం



హోమపూజలు చేస్తున్న పండితులు

మహానంది: గాజులపల్లె గ్రామంలో వెలిసిన నవగ్రహాల, శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గణపతిపూజ, పుణ్యాహవాచనం, నవగ్రహాల హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామి, అమ్మవార్లకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

మల్లన్న ఆలయం పుష్పశోభితం



వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉభయ ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. ఆలయ మహాద్వారం, ధ్వజస్తంభం, అమ్మవారి ఆలయం, ధ్వజస్తభం, రాజగోపురం వద్ద వివిధ రకాల పుష్పాలతో, స్వామిఅమ్మవార్ల ప్రతిమలను పోలి ఉండేవిధంగా అలంకరిస్తున్నారు. దీంతో మల్లన్న ఆలయం పుష్పశోభితమైంది. దసరా మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు చిన్నారులకు కుమారీపూజ నిర్వహిస్తున్నారు.

కొలనుభారతి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతిదేవి అమ్మవారిని పత్తికొండ ఎమ్మెల్యే కంగటి శ్రీదేవి శుక్రవారం దర్శించుకున్నారు. ఈఓ మోహన్ ఆలయ పురోహితులతో కలసి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఎమ్మెల్యే కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. సప్తశివాలయాల్లోని దేవాతామూర్తులను దర్శించుకున్నారు. అక్కడే ఉన్న ధారుఘోషిని నదిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఆలయ పురోహితులు ఎమ్మెల్యే శ్రీదేవికి అమ్మవారి చిత్రపటం, చీరె, సారే సమర్పించారు.



కొలనుభారతి అమ్మవారి సన్నిధిలో పత్తికొండ ఎమ్మెల్యే కంగటి శ్రీదేవి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై నిర్వహించిన పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శుక్రవారం తెనాలికి చెందిన ములుకుట్ల విశ్వనాథశర్మ వారిచే దేవీభాగవతం, హైదరాబాద్‌కు చెందిన విష్ణుభట్ల కార్తిక్ వారిచే పద్య పఠనం, హైదరాబాద్‌లోని సిరి ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన జ్యోత్స్న సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు.



సంప్రదాయ నృత్యప్రదర్శనలో కళాకారులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

నందికొట్కూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీ కెనాల్ ఏఈ నరేష్ మాట్లాడుతూ సుంకేసుల, మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి నవంబర్ చివరి వరకు వారబందీ మాదిరి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. అనంతరం వ్యవసాయశాఖ ఏఓ షేక్షావలి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద 2300 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు చేసిందని వాటిని ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. దామగట్ల సర్పంచ్ మాధవరం సుశీలమ్మ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు. సమావేశానికి హాజరుకాని అధికారుల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో డీటీ సోమేశ్వరీ, ఏఓ ప్రసాద్, జెడ్పీటీసీ కరిమున్నిసా, సర్పంచ్‌లు రవియాదవ్, జనార్దన్‌గౌడ్, లక్ష్మీదేవమ్మ, మరియమ్మ, ఎంపీటీసీలు సురేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించాలంటే ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' అంశంపై ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పథకాలను పారదర్శకంగా అందిస్తున్నారని, ఎన్నికల హామీలన్నీ అమలు చేశారని ప్రజలకు వివరించాలన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

ఏవైనా చిన్నచిన్న విభేదాలుంటే పక్కన పెట్టి కలిసిమెలసి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి గ్రామానికి రూ.3 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామన్నారు. ఆర్‌బీకేలు, సచివాలయాలు, హెల్త్ సెంటర్‌లు, పాలశీతలీకరణ కేంద్రాలు, ఆత్మకూరు పట్టణంలో శ్మశాన వాటికలు, ప్రభుత్వ వైద్యశాలలో పడకల పెంపు ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. వీటినే ప్రజలకు వివరించి మరోసారి జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకునేలా చైతన్యం చేయాలన్నారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయం పంపిన వీడియోను శిల్పా భువనేశ్వర రెడ్డి ప్రదర్శించి ప్రజల్లోకి పథకాలను ఎలా తీసుకెళ్లాలో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, కో-ఆప్టెడ్ మెంబర్ రషీద్, జేసీఎస్‌లు, కన్వీనర్లు, పార్టీనాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

కాత్యాయని దుర్గా.. కరుణించవమ్మా..!

మహానంది: అమ్మా కాత్యాయిని దుర్గా మమ్ము కరుణించవమ్మా అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం రాత్రి మహానందిలో కామేశ్వరీదేవి అమ్మవారు కాత్యాయిని దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, ఋత్వికులు శాస్త్రోక్త పూజలు నిర్వహించిన అనంతరం అశ్వవాహనంపై కొలువైన అమ్మవారి ఆలయ ప్రాకారంలో విహరించారు.



మహానందిలో అశ్వవాహనంపై శ్రీ కాత్యాయిని దుర్గ

నిఖా ఉత్సవానికి ఎమ్మెల్యే శిల్పా

మహానంది: బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ నేత దూదేకుల మౌలాలి కుమారుడి నిఖా మహోత్సవానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. శుక్రవారం ఆయన గ్రామానికి చేరుకుని వధూవరులను ఆశీర్వదించారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, పల్లె మహేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు అబ్బీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

మహానంది:అబ్బీపురం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఉదయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేక వైద్యనిపుణులు వస్తారని, బీపీ, షుగర్, ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

భూమిపూజ

ఆత్మకూరు: మండలంలోని ఎస్ఎన్ తండాలో శుక్రవారం నూతన రహదారులకు సర్పంచు నాగులునాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తెచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నారన్నారు. అందులో భాగంగా రహదారులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీబాయి, ఉపసర్పంచు వరలక్ష్మి, వార్డు సభ్యులు శివశంకర్ నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషిరెడ్డి, వెంకటేశ్వర్లు, మౌలాలి పాల్గొన్నారు



భూమి పూజ చేస్తున్న సర్పంచు నాగులు నాయక్



సరస్వతిదేవి అలంకరణలో కొలనుభారతిదేవి



సంగమేశ్వరంలో కాత్యాయని దేవి అలంకరణలో అమ్మవారు



మిడుతూరులో శారదాదేవిగా అమ్మవారు



నెహ్రూనగర్‌లో ధనలక్ష్మిగా దుర్గామాత



నందికొట్కూరులో శారదాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



వేల్పనూరులో కాత్యాయని దేవిగా పరమేశ్వరీదేవి

సరస్వతీ నమోస్తుతే!

● అక్షరాభ్యాసాలతో కొలనుభారతి క్షేత్రంలో సందడి

కొత్తపల్లి: అమ్మ సరస్వతిదేవీ నమోస్తుతే అంటూ భక్తులు కొలనుభారతి దేవిని స్తుతించారు. ఆశ్వీయుజ శుద్ధ షష్టీ శుక్రవారం అమ్మవారి మూలనక్షత్రం కావడంతో కొలనుభారతి దేవి అమ్మవారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పురోహితులు అమ్మవారిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూల మాలలు, నిమ్మకాయలతో అలంరించారు. ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి మూలనక్షత్రం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. చిన్నారులకు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసాలు చేయించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా సామూహిక అక్షరాభ్యాసాలతో కిక్కిరిసిపోయింది. అలాగే సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో లలితాదేవి అమ్మవారు ఆరవరోజు కాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రోహితులు తెలకపల్లి రఘురామశర్మ అమ్మవారిని గజపూలమాలలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

జూపాడుబంగ్లా మండలంలో..

జూపాడుబంగ్లా: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూపాడుబంగ్లాలో సరస్వతీ అమ్మవారు కాత్యాయనిగా భక్తులకు దర్శనమిచ్చారు. తాటిపాడు వీరభద్ర స్వామి ఆలయంలో దుర్గామాత సరస్వతీదేవి రూపంలో భక్తులను కరుణించారు.

● మిడుతూరు: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవీ ఆలయాల్లో అమ్మవార్లు శారదాదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, లలితసహస్ర నామం తదితర పూజలు నిర్వహించారు.



తాటిపాడులో సరస్వతీదేవి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్‌లో నెలకొల్పిన దుర్గామాత శుక్రవారం ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● నందికొట్కూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భక్తులకు శారదాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యులతో పాటు పలువురు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

● వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చారు. అలాగే వేల్పనూరులోని అంకాల పరమేశ్వరి అమ్మవారు కాత్యాయని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వాసవీ నిత్యాన్నదాన సత్రంలో వాసవీమాతను దేవీశరన్నవరాత్రోత్సవాల సందర్భంగా శుక్రవారం సరస్వతిదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. ముత్తైదువులు అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించి పూజించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

నందికొట్కూరు: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన వివరాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా వీడులకొండ గ్రామానికి చెందిన రాజుబాబు(36) కాల్వబుగ్గ వద్ద ఇటుకల పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నెల 10న నంద్యాల రోడ్డులో ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ లింక్ ఊడిపోవడంతో బోల్తా పడింది. ప్రమాదంలో రాజుమాబు తీవ్రంగా గాయపడటంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు కాకినాడకు తీసుకెళ్లారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. భార్య రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన యువరాజు నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఇటీవల తల్లిదండ్రులు చదువు మాన్పించారు. ఈక్రమంలో ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టపక్కల, బంధువులను విచారించిన ఆచూకీ లేకపోవడంతో తండ్రి దేవభూషణం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు

నందికొట్కూరు: బాలికను యువకుడు కిడ్నాప్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాలు.. పాములపాడు మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీకాంత్ తన ఇంటి పక్కనే ఉన్న బాలికకు మాయమాటలు చెప్పి ఈనెల 9న తిరుపతికి తీసుకెళ్లాడు. కుటుంబ సభ్యులు బాలిక కోసం గాలించి ఆచూకీ లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ నెల 18న కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా తిరుపతిలో పెళ్లికి ఏర్పాట్లు చేస్తుండటం గమనించిన బాలిక 19న యువకుడి నుంచి తప్పించుకుని నందికొట్కూరు పోలీసు స్టేషన్‌కు చేరుకుంది. బాలిక ఫిర్యాదు మేరకు యువకుడిపై కిడ్నాప్, ఫొక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సహకార సొసైటీ అధ్యక్షుడికి మాతృవియోగం

మిడుతూరు: పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి భారత లక్ష్మీదేవమ్మ (70) శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అంత్యక్రియలు నాగలూటి గ్రామంలో శనివారం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు తులసిరెడ్డి తెలిపారు.